


నేటి మ్యాచ్
న్యూజిలాండ్ X బంగ్లాదేశ్
మ. 2.00 నుంచి
వేదిక: చెన్నై

క్వింటన్ డికాక్ సూపర్ సెంచరీ

# కంగారూలు సఫా

177 పరుగులకు ఆసీస్ ఆలౌట్


## ఆస్ట్రేలియాపై దక్షిణాఫ్రికా అద్భుత విజయం • మూడు వికెట్లతో రబాడ విజృంభణ

**ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా భారీ విజయాల పరంపర దిగ్విజయంగా కొనసాగుతున్నది. తమ తొలి మ్యాచ్‌లో లంకను గెలిచిన సఫారీలు మలి పోరులో కంగారూల భరతం పట్టారు. సమిష్టి ప్రదర్శన కనబరుస్తూ ఆసీస్‌ను ఆడుకున్నారు. సుదీర్ఘ ప్రపంచకప్ చరిత్రలో కంగారూలకు భారీ ఓటమిని కట్టబెట్టారు. డికాక్ సూపర్ సెంచరీతో పోరాడే స్కోరు అందుకున్న దక్షిణాఫ్రికా..రబాడ, ఎంగ్డీ పదునైన పేస్‌కు తోడు మహారాజ్ స్పిన్‌తో ఆసీస్‌ను ముప్పతిప్పలు పెట్టింది.**


**70 పరుగులకే సగం వికెట్లు కోల్పోయిన కమిన్స్ సేన..సఫారీలకు ఏ దశలోనూ పోటీనివ్వలేక స్వల్ప స్కోరుకే కుప్పకూలింది. చెలరేగుతాడనుకున్న వార్నర్ ఆదిలోనే నిష్క్రమిస్తే...ఆపద్బాంధవుడు స్మిత్ వికెట్ల ముందు అడ్డంగా దొరికిపోయాడు. లబుషేన్, స్టార్క్ పోరాటం ఆసీస్‌ను ఒడ్డున పడేయలేక పోయింది. ఫలితంగా సఫారీలు వరుసగా రెండో విజయంతో ప్రపంచకప్ వేటను కొనసాగిస్తున్నారు.**

లక్నో: ప్రపంచంలోని రెండు మేటి జట్ల మధ్య పోరు ఏకపక్షమైంది. అటల్ బిహారీ వాజపేయ ఏకానా స్టేడియంలో గురువారం ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ ఆస్ట్రేలియాతో జరిగిన పోరులో దక్షిణాఫ్రికా 134 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత ఓపెనర్ క్వింటన్ డికాక్(106 బంతుల్లో 109, 8ఫోర్లు, 5 సిక్స్‌లు) సూపర్ సెంచరీకి తోడు మార్క్‌రమ్ (56) రాణించడంతో దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 311/7 స్కోరు చేసింది. మ్యాక్స్‌వెల్ (2/34), స్టార్క్(2/53) రెండేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఆసీస్..రబాడ(3/33), మహారాజ్(2/30), షంసీ(2/38), జాన్సెన్(2/54) ధాటికి 40.5 ఓవర్లలో 177 పరుగులకు ఆలౌటైంది. లబుషేన్(46) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. మెగాటోర్నీలో వరుసగా రెండో సెంచరీతో కదంతొక్కిన డికాక్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఈ విజయంతో నాలుగు పాయింట్లతో దక్షిణాఫ్రికా టాప్‌లోకి దూసుకెళ్లగా, ఆసీస్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లో రెండు ఓటములతో తొమ్మిదో స్థానంలో కొనసాగుతున్నది.

**డికాక్ దంచెన్:** టాస్ గెలిచిన ఆసీస్..దక్షిణాఫ్రికాను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. కంగారూలు ఇక్కడే పప్పులో కాలేశారు. పిచ్‌పై పూర్తి అవగాహన ఉన్న సఫారీ ఓపెనర్ క్వింటన్ డికాక్ ఆది నుంచే ఆసీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఐపీఎల్‌లో లక్నో తరఫున ఆడిన అనుభవమున్న డికాక్..కళాత్మక షాట్లతో కంగారూలను ఇబ్బందిపెట్టాడు. కెప్టెన్ బవుమా(35) అండగా చేసుకుంటూ డికాక్ తన ఇన్నింగ్స్‌లో 8ఫోర్లు, 5 భారీ సిక్స్‌లతో చెలరేగాడు. సాఫీగా సాగుతున్న ఇన్నింగ్స్‌ను పార్ట్‌టైమ్ స్పిన్నర్ మ్యాక్స్‌వెల్..బవుమాను ఔట్ చేసి దెబ్బకొట్టాడు. దీంతో తొలి వికెట్‌కు 108 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. డస్సెన్(26) స్వల్ప స్కోరుకే వెనుదిరుగగా, మార్క్‌రమ్ మరోమారు బ్యాటు ఝులిపించాడు. డికాక్, మార్క్‌రమ్ కలిసి ఆసీస్ బౌలింగ్ దాడిని సమర్థంగా తిప్పికొట్టారు. సఫారీల ఆధిపత్యానికి చెక్ పెట్టేందుకు ఆసీస్ కెప్టెన్ కమిన్స్ ఎన్ని రకాలుగా బౌలింగ్ మార్చిమార్చి ప్రయోగించినా ఆశించిన ఫలితం దక్కలేదు. మాక్స్‌వెల్ బౌలింగ్‌లో షాట్ ఆడబోయిన డికాక్..క్లీన్‌బౌల్డ్ కావడంతో ఆసీస్ ఊపిరి పీల్చుకుంది. ఈ మెగాటోర్నీలో వరుసగా రెండో సెంచరీ ఖాతాలో వేసుకున్న డికాక్..జట్టు భారీ స్కోరుకు కారణమయ్యాడు. అయితే ఆఖర్లో ఆసీస్ బౌలింగ్ కట్టుదిట్టం చేయడంతో పరుగుల రాక మందగించింది. ఇదిలా ఉంటే ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టుగా మన్ననలు అందుకున్న ఆసీస్..ఈ మ్యాచ్‌లో ఐదు క్యాచ్‌లు నేలపాలు చేసి అప్రతిష్ఠ మూటగట్టుకుంది.


రబాడ(3/33)

**కంగారూలు క్యూ:** నిర్దేశిత లక్ష్యఛేదనలో ఆసీస్‌కు సరైన శుభారంభం దక్కలేదు. ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్న మిచెల్ మార్ష్(7) మరోమారు నిరాశపరిచాడు. జాన్సెన్ బౌలింగ్‌లో బవుమాకు క్యాచ్ ఇచ్చి తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. మరోవైపు దూకుడు కనబరుస్తాడనుకున్న వార్నర్ కూడా పెవిలియన్ బాట పట్టడంతో ఆసీస్ 27 పరుగులకే ఓపెనర్లను కోల్పోయింది. రబాడ బౌలింగ్‌లో స్టీవ్ స్మిత్(19) వికెట్ల ముందు అడ్డంగా దొరికిపోగా, ఇంగ్లిస్(5)సూపర్ స్వింగ్‌తో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. టోర్నీలో తొలి మ్యాచ్ ఆడుతున్న స్టొయినిస్(5) డికాక్ క్యాచ్‌తో భారంగా నిష్క్రమించాడు. భారీ షాట్లతో ఇన్నింగ్స్‌ను నిలబెడుతాడనుకున్న మాక్స్‌వెల్‌ను మహారాజ్ తన బుట్టలో వేసుకున్నాడు. దీంతో ఆసీస్ 70 పరుగులకే 6 కీలక వికెట్లు కోల్పోయింది. ఈ తరుణంలో లబుషేన్, స్టార్క్(27) ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశారు. వీరిద్దరు ఏడో వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయినా ఏ మాత్రం పట్టువదలని సఫారీలు తమ బౌలింగ్ దళంతో కంగారూల పీక పిసికారు.


డికాక్(109)

**1** ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియాకు ఇది తొలిసారి. 2019 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ చేతిలో ఓడిన ఆసీస్..ప్రస్తుతం భారత్, సఫారీలపై పరాజయం పాలైంది.

**1** వన్డే ప్రపంచక్ చరిత్రలో భారీ తేడాతో ఓటమిపాలు కావడం ఆస్ట్రేలియాకు ఇది తొలిసారి. 40 ఏండ్ల క్రితం 1983లో భారత్ చేతిలో 118 పరుగుల తేడాతో ఓడటం ఇప్పటి వరకు ఆసీస్‌కు చెత్త ఓటమి

**1** వన్డే ప్రపంచకప్‌లో 70 పరుగుల లోపు సగం వికెట్లు కోల్పోవడం ఆసీస్‌కు ఇది తొలిసారి

### ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక

| దే | ఆ | గె | ఓ | ర.రే. | పా |
|---|---|---|---|---|---|
| దక్షిణాఫ్రికా | 2 | 2 | 0 | +2.36 | 4 |
| న్యూజిలాండ్ | 2 | 2 | 0 | +1.95 | 4 |
| భారత్ | 2 | 2 | 0 | +1.50 | 4 |
| పాకిస్థాన్ | 2 | 2 | 0 | +0.92 | 4 |
| ఇంగ్లండ్ | 2 | 1 | 1 | +0.55 | 2 |
| బంగ్లాదేశ్ | 2 | 1 | 1 | −0.65 | 2 |
| శ్రీలంక | 2 | 0 | 2 | −1.16 | 0 |
| నెదర్లాండ్స్ | 2 | 0 | 2 | −1.80 | 0 |
| ఆస్ట్రేలియా | 2 | 0 | 2 | −1.84 | 0 |
| అఫ్ఘానిస్థాన్ | 2 | 0 | 2 | −1.90 | 0 |

నోట్: దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్

### సంక్షిప్త స్కోరు

**దక్షిణాఫ్రికా:** 50 ఓవర్లలో 311/7(డికాక్ 109, మార్క్‌రమ్ 56, మ్యాక్స్‌వెల్ 2/34, స్టార్క్ 2/53), **ఆస్ట్రేలియా:** 40.5 ఓవర్లలో 177 ఆలౌట్(లబుషేన్ 46, స్టార్క్ 27, రబాడ 3/33, మహారాజ్ 2/30).

### కంగారూలకు కలిసిరాలేదు

దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో ఆసీస్‌కు ఏదీ కలిసిరాలేదు. టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకోవాల్సింది పోయి..దక్షిణాఫ్రికాను బ్యాటింగ్‌కు ఆహ్వానించడంతోనే కంగారూల పని అయిపోయింది. డికాక్ సూపర్ సెంచరీతో చెలరేగిన వేళ..ఆసీస్ బౌలర్లు చేష్టలుడిగిపోయారు. ప్రపంచంలోనే అత్యుత్తమ జట్లలో ఒకటైన ఆసీస్ ఏకంగా ఐదు క్యాచ్‌లు విడిచిపెట్టి తమ పేలవ ఫీల్డింగ్‌తో మూల్యం చెల్లించుకుంది. ఛేదనలో ఓపెనర్లు విఫలం కాగా, సంచలన నిర్ణయాలతో స్మిత్, స్టొయినిస్ భారంగా పెవిలియన్ చేరారు.

# దాయాదితో పోరుకు గిల్ రెడీ

## నెట్స్‌లో చెమటోడ్చిన గిల్ • 14న పాక్‌తో మ్యాచ్



అహ్మదాబాద్ : భారత ఓపెనర్ శుభ్‌మన్ గిల్ ఎట్టకేలకు వన్డే ప్రపంచ కప్‌లో తొలి మ్యాచ్ ఆడనున్నాడు. డెంగీ జ్వరం కారణంగా ఆస్ట్రేలియా, అఫ్ఘానిస్థాన్‌తో మ్యాచ్‌లకు దూరమైన గిల్.. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై బరిలోకి దిగే అవకాశం ఉంది. చెన్నైలో ప్రైవేట్ ఆస్పత్రిలో డెంగీ నుంచి కోలుకున్న గిల్ బుధవారం అహ్మదాబాద్ చేరుకున్నాడు. పాక్‌తో మ్యాచ్‌కు ముందు ఓసారి తన టెక్నిక్, ఫిట్‌నెస్‌ను సరిచూసుకునేందుకు ఈ విధ్వంసక ఓపెనర్ గురువారం నెట్స్‌లో చెమటోడ్చాడు. గంటపాటు బ్యాటింగ్ ప్రాక్టీస్ అనంతరం ఫీల్డింగ్ కూడా చేశాడు. దాంతో, అక్టోబర్ 14న దాయాదితో జరిగే మ్యాచ్‌లో రోహిత్ శర్మతో కలిసి గిల్ ఇన్నింగ్స్ ఆరంభించడం ఖాయం అనిపిస్తోంది. ఈ ఏడాది ఐదు శతకాలతో భీకర ఫామ్‌లో ఉన్న గిల్ రాకతో టాపార్డర్ మరింత బలోపేతం కానుంది. పైగా నరేంద్ర మోడీ స్టేడియంలో గిల్‌కు తిరుగులేని రికార్డు ఉంది. ఈ ఏడాది టీ20ల్లో తొలి సెంచరీ(న్యూజిలాండ్‌పై)తో పాటు ఐపీఎల్ 16వ సీజన్‌లో ఈ చిచ్చరపిడుగు ఇదే వేదికపై రెండు శతకాలు కొట్టాడు. తనకు బాగా అచ్చొచ్చిన అహ్మదాబాద్ పిచ్‌పై పాక్ బౌలర్లను ఉతికారేసేందుకు గిల్ సిద్ధమవుతున్నాడు. గిల్ స్థానంలో రిజర్వ్ ఓపెనర్ ఇషాన్ కిషన్ ఆసీస్‌పై గోల్డెన్ డక్‌తో నిరాశపరిచినా.. అఫ్ఘనిస్థాన్‌పై 47 పరుగులతో ఫర్వాలేదనిపించాడు. సిక్సర్ల వీరుడు రోహిత్ సెంచరీ(131)తో కదంతొక్కగా.. టీమ్ఇండియా 8 వికెట్ల తేడాతో భారీ విజయం సాధించింది. అదే ఊపులో పాక్‌ను చిత్తు చేసి హ్యాట్రిక్ విజయం నమోదు చేయాలని రోహిత్ సేన భావిస్తోంది.

# గేల్ నా రోల్ మోడల్ : రోహిత్



ఢిల్లీ : ప్రపంచకప్ అంటే చాలు భారత కెప్టెన్ రోహిత్ శర్మ పూనకం వచ్చినట్టు సెంచరీల మీద సెంచరీలు కొడుతుంటాడు. నిలబడి మంచినీళ్లు తాగినంత తేలికగా భారీ సిక్సర్లతో బౌలర్ల వెన్నులో వణుకు పుట్టిస్తాడు. ఈసారి సొంత గడ్డపై జరుగుతున్న మెగా టోర్నీలో హిట్‌మ్యాన్ తొలి సెంచరీ కొట్టాడు. అఫ్గనిస్థాన్‌పై శతకంతో విజృంభించిన హిట్‌మ్యాన్ అంతర్జాతీయ క్రికెట్‌లో పలు రికార్డులు తిరగరాశాడు. రోహిత్ ధాటికి యూనివర్సల్ బాస్‌గా పేరొందిన వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ అత్యధిక సిక్సర్ల(553) రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. మూడు ఫార్మాట్లలో అత్యధిక సిక్సర్ల (556) వీరుడిగా హిట్‌మ్యాన్ సరికొత్త రికార్డు సృష్టించాడు. గేల్ రికార్డు బద్ధలు కొట్టడానికి రోహిత్‌కి స్ఫూర్తి ఎవరో తెలుసా..? ఇంకెవరూ గేల్. ఈ విషయాన్ని రోహిత్ స్వయంగా వెల్లడించాడు. యూనివర్స్ బాస్ ఎల్లప్పుడూ యూనివర్స్ బాసే. అయితే.. నేను అతడి రికార్డులు పుస్తకంలోంచి ఒక పేజీని తీసేసుకున్నా. చాలాఏళ్లుగా గేల్ ఆటను మనం చూశాం. అతడొక సిక్సర్ల మెషిన్. పైగా మా ఇద్దరి జెర్సీ నంబర్(45) కూడా ఒకటే. 45 నంబర్ జెర్సీ ఆటగాడు తన రికార్డు బ్రేక్ చేసినందుకు గేల్ చాలా సంతోషిస్తాడని నేను అనుకుంటున్నా అని రోహిత్ వెల్లడించాడు. అఫ్గాన్ బౌలర్లపై విరుచుకుపడిన రోహిత్ 81 బంతుల్లోనే 131 పరుగులు సాధించాడు. అతడి సుడిగాలి ఇన్నింగ్స్‌లో 5 సిక్సర్లు ఉన్నాయి. దాంతో, టెస్టులు, వన్డే, టీ20.. ఈ మూడు ఫార్మాట్లలో అత్యధిక సిక్సర్ల (556) వీరుడిగా హిట్‌మ్యాన్ రికార్డు నెలకొల్పాడు. గేల్ 483 మ్యాచుల్లో ఈ ఫీట్ సాధిస్తే.. రోహిత్ అతడి కంటే తక్కువ మ్యాచుల్లో(453)నే ఈ మైలురాయిని అందుకోవడం విశేషం.

# ఆకట్టుకున్న ఆర్యవారియర్స్

తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ రెండో ఎడిషన్

హైదరాబాద్ : శ్రీనిధి యూనివర్సిటీ నిర్వహిస్తున్న తెలంగాణ ప్రీమియర్ లీగ్ రెండో ఎడిషన్ రసవత్తరంగా జరుగుతోంది. నరసింహరాజు, మురళీ యాదవ్ నాలుగో విజయంతో ఎంవైకే స్ట్రయికర్స్‌కు 8 పాయింట్లు అందించారు. ఆర్య వారియర్స్ కూడా ఏడు పాయింట్లతో టీమ్ టీ ఆఫ్, సెలబ్రిటీ స్టింగర్స్, ఆటమ్ చార్జర్స్‌తో కలిసి రెండో స్థానానికి చేరింది. రన్ అఫే లీడర్లు ఏకంగా 16 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. అక్టోబర్ 14న మూడో రౌండ్, అక్టోబర్ 18వ తేదీన నాలుగో రౌండ్ జరుగనున్నాయి.

# మణికంఠ పసిడి పరుగు

100మీటర్ల పరుగులో స్వర్ణం



బెంగళూరు: జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో యువ అథ్లెట్ మణికంఠ పసిడి వెలుగులు విరజిమ్మాడు. గురువారం జరిగిన పురుషుల 100మీ టర్ల రేసును 10.42 సెకన్లలో ముగించిన మణికంఠ టాప్‌లో నిలిచాడు. అంతకు ముందు జరిగిన ట్రయల్స్‌లో 10.23 సెకన్ల టైమింగ్‌తో జాతీయ రికార్డు నెలకొల్పిన మణికంఠ తుది పోరులోనూ సత్తాచాటాడు. నిఖిల్ పాటిల్ (10.69సె), శివ (10.70సె) వరుసగా రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. మహిళల 100మీటర్ల పరుగులో గిరిధారిణి రవికుమార్ 11.36 సెకన్ల టైమింగ్‌తో అగ్రస్థానం సొంతం చేసుకుంది. స్నేహ (11.42సె), కమల్‌జీత్‌కౌర్ (11.52సె) వరుసగా రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. పురుషుల 110మీటర్ల హర్డిల్స్‌లో తేజాస్ స్వర్ణం సొంతం చేసుకున్నాడు.

# వరల్డ్ అథ్లెట్ రేసులో నీరజ్

**పోటీలో షాట్‌పుటర్ రియాన్**

ఆసియా క్రీడల్లో స్వర్ణం పతకం గెలిచిన భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా మరో ఘనత సొంతం చేసుకోనున్నాడు. జావెలిన్ త్రోలో ప్రకంపనలు సృష్టిస్తున్న నీరజ్ వరల్డ్ అథ్లెట్ 2023 నామినేషన్ దక్కించుకున్నాడు. పురుషుల విభాగంలో ఈ అవార్డుకు నామినేట్ అయిన 10 మందిలో నీరజ్ ఒకడు. పరుగుల వీరుడు నొవాహ్ లిల్స్, షాట్‌పుటర్ రియాన్ క్రౌసర్, పోల్‌వాల్ట్ స్టార్ మొండో డుప్లంటిస్, 3వేల మీటర్ల స్టీపుల్ ఛేజ్ రన్నర్ సొఫియానే బక్కాలి, 5వేల మీటర్ల స్ప్రింటర్ జాకబ్ ఇంగెబ్రిగ్‌స్టెన్, మారథాన్ రన్నర్ పియెర్సె లెపగే, రేస్ వాకర్ అల్వారో మార్టిన్, లాంగ్ జంపర్ మిల్తియడిస్ టెంటొగ్లూ పోటీ పడుతున్నారు. ఈ ఏడాది నీరజ్ చోప్రా సంచలన ప్రదర్శనతో వరల్డ్ చాంపియన్‌గా అవతరించాడు. హాంగ్జౌలో జరిగిన ఆసియా క్రీడల్లో అదే జోరు కనబరిచి.. ఫైనల్లో ఈటెను 88.88 మీటర్ల దూరం విసిరి దేశానికి పసిడి పతకం అందించాడు. వచ్చే ఏడాది ప్యారిస్ ఒలింపిక్స్‌లో నీరజ్ భారీ అంచనాలతో బరిలోకి దిగనున్నాడు.

# పాక్ జట్టుకు ఘనస్వాగతం



అహ్మదాబాద్ : ప్రపంచ కప్ కోసం పదేళ్ల తర్వాత భారత గడ్డపై అడుగుపెట్టిన పాకిస్థాన్ జట్టుకు ఎక్కడికి వెళ్లినా ఘనస్వాగతం లభిస్తోంది. హైదరాబాద్‌లో అభిమానుల ప్రేమకు, ఆతిథ్యానికి ఫిదా అయిన పాక్ క్రికెటర్లకు అహ్మదాబాద్‌లోనూ అదే తరహా ఆహ్వానం లభించింది. భారత జట్టుతో అక్టోబర్ 14న మ్యాచ్ కోసం బాబర్ ఆజాం బృందం గురువారం అహ్మదాబాద్ చేరుకుంది. విమానాశ్రయం నుంచి టీమ్ హోటల్‌కు వెళ్లిన పాక్ ఆటగాళ్లను శాలువాతో సత్కరించి.. పూలు జల్లుతూ, బెలూన్లు విసురుతూ సాదరంగా ఆహ్వానించారు. డోలుబాజాల శబ్దానికి తగ్గట్టు కళాకారులు తమ నృత్య అభినయంతో వెల్‌కం చెప్పారు. క్రికెట్‌లో గొప్ప సమరంగా అభివర్ణించే భారత్, పాకిస్థాన్ మ్యాచ్ అహ్మదాబాద్ వేదికగా శనివారం జరుగనుంది. లక్షమందికి పైగా అభిమానులు పోటెత్తనున్న నేపథ్యంలో గుజరాత్ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో పాటు హోమ్ గార్డ్స్ కలిపి మొత్తం 11 వేలకు పైగా బందోబస్త్‌లో పాల్గొననున్నారు. మెగాటోర్నీలో ఆడిన రెండు మ్యాచుల్లో గెలుపొందిన రోహిత్, బాబర్ సేనకు ఈ మ్యాచ్ కీలకం కానుంది. అయితే.. ప్రపంచ కప్‌లో పాక్‌పై టీమ్ఇండియాకు ఘనమైన రికార్డు ఉన్న సంగతి తెలిసిందే.

# క్వార్టర్స్‌లో రష్మిక



హైదరాబాద్, ఆట ప్రతినిధి: థాయ్‌లాండ్ వేదికగా జరుగుతున్న ఐటీఎఫ్ మహిళల వరల్డ్ టూర్ టోర్నీలో రాష్ట్ర యువ ప్లేయర్ శ్రీవల్లి రష్మిక సత్తాచాటుతున్నది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్‌లో రష్మిక క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లింది. ప్రిక్వార్టర్స్ పోరులో రష్మిక 6−2, 7−5తో యనాన్ హా(చైనా)పై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన రష్మిక..ప్రత్యర్థిని వరుస సెట్లలో మట్టికరిపించింది. అంతకుముందు జరిగిన లీగ్ పోరులోనూ ఈ యువ ప్లేయర్ అలవోక విజయాన్ని సొంతం చేసుకుంది.



# అవినీతికి తావులేకుండా..

**హెచ్‌సీఏ ఎన్నికలకు శ్రీనివాస్ ప్యానెల్ సిద్ధం**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లో ఎన్నికల కోలాహలం నెలకొన్నది. ఎన్నికల తేదీకి గడువు దగ్గర పడుతుండటంతో అందరూ తమదైన అస్త్ర శస్త్రాలతో గోదాలోకి దిగుతున్నారు. పీఎల్ శ్రీనివాస్ అధ్యక్షుడిగా తమ ప్యానెల్‌ను గురువారం అధికారికంగా ప్రకటించింది. ఇందులో ఉపాధ్యక్షుడిగా బాబురావు, కార్యదర్శిగా భాస్కర్, సంయుక్త కార్యదర్శిగా రోహిత్ అగర్వాల్, కోశాధికారిగా గెరార్డ్ కార్, కౌన్సిలర్ వాల్టర్ పోటీ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా భేటీలో వారి అజెండాను వివరించారు. హెచ్‌సీఏలో ఎలాంటి అవినీతికి తావులేకుండా పక్షపాత పాలనకు పెద్దపీట వేస్తామని తెలిపారు.

# ఆర్కిటిక్ ఓపెన్‌క్వార్టర్స్‌లో సింధు

వంతా (ఫిన్‌లాండ్) : ఆసియా క్రీడల్లో విఫలమైన పీవీ సింధు ఆర్కిటిక్ ఓపెన్‌లో అదరగొడుతోంది. మహిళల సింగిల్స్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఎనిమిదో సీడ్ సింధు గురువారం 38 నిమిషాల్లోనే చైనీస్ తైపీకి చెందిన వెన్ చీ హ్సూను 21−11, 21−10తో మట్టికరిపించింది. ఈ ఏడాది ఒక్క టోర్నీలోనూ కార్టర్స్ దాటని ఆమె ఈసారి ఆ గండాన్ని దాటి టైటిల్ గెలవాలనే పట్టుదలతో ఉంది. మరోవైపు.. పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్, కిరణ్ జార్జ్ అనూహ్యంగా టోర్నీ నుంచి నిష్క్రమించారు. జపాన్ ప్లేయర్ కంటా త్సునేయమ చేతిలో శ్రీకాంత్ 15−21, 12−21తో.. చైనా ఆటగాడు లూ ఝూంగ్ జూ చేతిలో జార్జ్ 10−21, 20−22తో ఓటమిపాలయ్యారు. మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప ముందంజ వేసింది.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.